www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 29 సెప్టెంబర్ 2024
5
డాక్టర్ బిఆర్.అంబేద్కర్
కోనసీమ



కడియంలో 'ఇంద్రధనస్సు' కనువిందు

ప్రజాశక్తి-కడియం



నాలుగు రోజులుగా చిరుత పులి భయంతో బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్న కడియం నర్సరీ ప్రాంత ప్రజలకు శనివారం సాయంత్రం ఇంద్రధనస్సు కనువిందు చేసింది. సుమారు 20 నిమిషాల పాటు ఇంద్రధనస్సు ఈ ప్రాంత ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది.

బంకుల్లో నిబంధనలు గాలికి..!

- పెట్రోలు, డీజిల్ నాణ్యతపై అనుమానాలు
- కనీస వసతులు కరువు
- అరకొర తనిఖీలకే పరిమితం

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

వ్యాపార లాభార్జనే ధ్యేయంగా పెట్రోలు బ్యాంకుల యజమానులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం విధించిన అనేక ప్రమాణాలున్నా అవి పాటించడం లేదు. నిబంధనలను మాకా అంటూ నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్నారు. బంకుల నిర్వహణలో కనీస ప్రమాణాలని సైతం పక్కన పెట్టి వ్యాపారం సాగిస్తున్నారు. కొన్నిచోట్ల కొలతల్లో తేడాలు చేస్తూ కాసులు వెనకేసుకుంటున్నారు. మరికొన్ని చోట్ల కల్తీ పెట్రోల్, డీజిల్ అమ్ముతున్నారనే ఆరోపణలు లేకపోలేదు. నిరంతరం బంకుల్లో తనిఖీలు చేయాల్సిన సంబంధిత శాఖ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తుండడం గమనార్హం. సంబంధిత యజమానులు వినియోగదారులకు ఉచితంగా పలు సేవలను అందించాల్సిన ఉంది. ఆ సేవలు అందేలా చూడడంతోపాటు ఆయా నిబంధనలను పాటించేలా చూడాల్సిన బాధ్యత వీరిపై ఉంది.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ప్రధానంగా హెచ్‌పి, ఇండియన్ ఆయిల్, భారత్ కంపెనీలకు చెందిన సుమారు 300 బంకులున్నాయి. ఎక్కువ శాతం బంక్ యజమానులు ప్రభుత్వం విధించిన నిబంధనలేమీ పాటించడం లేదనే విమర్శలు వినియోగదారుల నుంచి తరచూ వినిపిస్తున్నాయి. నిర్వాహకులు నిర్దిష్టంగా కొన్ని ప్రమాణాలు పాటించాలని ప్రభుత్వం పదే పదే చెబుతున్నా వాటిని పెడచెవిన పెడుతున్నారు. కనీసం మరుగుదొడ్ల నిర్వహణ కూడా సక్రమంగా నిర్వహించలేకపోతున్నాయి. సిబ్బంది మాత్రమే వినియోగించుకునే విధంగా మాత్రమే ఉంచుతున్నారు. అధిక శాతం బంకుల్లో వాహనాలకు గాలి పెట్టే సదుపాయం కల్పించడం లేదు. పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించకుండానే ఉన్న వారిపైనే పని ఒత్తిడి పెంచుతున్నారు.



నామమాత్రపు తనిఖీలకే పరిమితమా..?

పెట్రోల్, డీజిల్ నాణ్యత, కొలతలను పరిశీలించడమే కాక అక్కడ మౌలిక సదుపాయాలు ఉన్నాయా..? లేవా..? అన్న అంశాలపై నిత్యం అధికారులు తనిఖీలు నిర్వహించాల్సి ఉంది. ప్రతి బంక్‌లో మూత్రశాలలు, మరుగుదొడ్లు సౌకర్యం కచ్చితంగా ఉండేలా యాజమాన్యాలు చూడాల్సి ఉంది. బంక్‌ల వద్ద విద్యుత్ తీగలు బయటకు కనిపించకుండా ఉండాలి. హైటెన్షన్ విద్యుత్ తీగలు లేకుండా చూసుకోవాలి. పెట్రోల్ పోసే పంపుల వద్ద డ్రై కెమికల్ పౌడర్ (డిసిపి), ఫామ్ ఎన్సీమిషల్, బకెట్లలో ఇసుక, నీరు నింపి విధిగా ఉంచాలి. 6 పైపుల నుంచి ఆపై పంపులు ఉన్న పెద్ద బంకుల్లో 50 కేజీల కెపాసిటీ గల డిసిపి, 10 వేల లీటర్ల కెపాసిటీ గల నీటి ట్యాంక్‌ను నిత్యం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి. ప్రమాదాలు జరిగిన సందర్భాల్లో సమర్థవంతంగా ఎదుర్కొనేలా అన్ని సౌకర్యాలు ఉండాలి. ప్రతి బంకుకు మూడు వైపులా ఆరడుగుల ఎత్తున ప్రహరీ ఉండాలి. వాహనాల చక్రాల్లో గాలిని సరి చూడాలి. తక్కువయితే ఉచితంగా నింపాలి. జాతీయ రహదారిపై ఉన్న బంకుల్లో ప్రయాణికుల సౌకర్యార్థం విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాలి. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి అత్యవసరంగా చికిత్స అందించేందుకు ప్రథమ చికిత్స, మందుల్ని అందుబాటులో ఉంచాలి. ఇంధన నాణ్యతను పరిశీలించడానికి ఫిల్టర్ పేపర్లు/ హైడ్రో ధర్మా మీటరును అందుబాటులో ఉంచాలి. వాహనం చోదకులు అడిగితే ఇవ్వాలి. పెట్రోల్ పరిమాణాన్ని కొలిచే పరికరాల్ని వాహనదారుల కోసం అందుబాటులో ఉంచాలి. తాగునీటి సౌకర్యం కచ్చితంగా ఉండేలా చర్యలుండాలి. ఉచితంగా అందించే సేవలపై బంకు ఆవరణలో విధిగా బోర్డు ఏర్పాటు చేయాలి. అయితే అనేక బంకుల్లో ఇటువంటి సౌకర్యాలు ఎక్కడా కనిపించవు. వీటిపై ఆయా యాజమాన్యాలకు సూచనలు ఇవ్వడంతోపాటు వీటిని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపైనే ఉంది.

అయితే అనేక మంది యథేచ్ఛగా నిబంధనలు అతిక్రమించి వ్యాపారాలు సాగిస్తున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 70 శాతం బంకుల్లో మరుగుదొడ్ల సౌకర్యాలే ఉండడం లేదు. పంపుల వద్ద ఇసుక, నీటి బకెట్లను ఎక్కడా ఉంచడం లేదనే విమర్శలు వస్తున్నాయి. పెట్రోలు పరిమాణాన్ని కొలిచే పరికరాలు, ప్రథమ చికిత్స కిట్లు, వాహనాల్లో గాలిని నింపే సౌకర్యాలు ఎక్కడా కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో అధికారులు నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

సిబ్బంది ఇబ్బందులు

ఇంధనం నింపే కార్మికులు బంకుల్లో 24 గంటలూ సేవలందిస్తుంటారు. వీరు విడతల వారీగా పని చేస్తారు. వేతనం నెలంతా కష్టపడి పని చేస్తే లభించేది కేవలం రూ.5 వేల నుంచి రూ.8 వేలు మాత్రమే. కొత్తగా పనిలోకి చేరిన వారికి రూ.4 వేలు కూడా చెల్లించని పరిస్థితి ఉంది. చాలీచాలని వేతనాలతో కుటుంబ పోషణ భారంగా ఉందని పలువురు సిబ్బంది వాపోతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పెరుగుతున్న నిత్యావసరాల ధరలు, ఇంటి అద్దెలు, పిల్లల విద్యకోసం ఖర్చు చేసే ఫీజులు, విద్యుత్ బిల్లులు, వైద్యం తదితర ఖర్చులకు వచ్చే వేతనం ఏ మూలకూ సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

30న సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి-అమలాపురం




సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ తదితరుల సమస్యల పరిష్కారం కోసం సిఐటియు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 30న సోమవారం అమలాపురం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తామని సిఐటియు నాయకులు తెలిపారు. అమలాపురం సిఐటియు కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరాం, కోశాధికారి కృష్ణవేణి, ఉపాధ్యక్షులు ఎం.భాస్కర్ మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ శాఖలు, పథకాలు, సంస్థల్లోని ఔట్సోర్సింగ్, కాంట్రాక్ట్, టైం స్కేల్, కంటింజెంట్, పార్ట్ టైం, గెస్ట్, పీస్ రేటు, గౌరవ వేతన నాన్ రెగ్యులర్ ఉద్యోగులకు రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా వేతనాలు, సౌకర్యాలు అమలు చేయాలని పర్మినెంట్ చేయాలని సెప్టెంబర్ 30న సోమవారం జిల్లా కేంద్రం అమలాపురంలో జరిగే ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రభుత్వ సొసైటీలు, యూని వర్శిటీలు స్థానిక సంస్థల్లో ఉద్యోగులందరికీ సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని పర్మినెంట్ చేయాలని సిఐటియూ డిమాండ్ చేస్తోందన్నారు. 2014 జూన్ ముందు నుంచి ఎన్‌హెచ్ఎం, ఇతర వైద్య, ఆరోగ్యశాఖ స్కీముల్లో పని చేస్తున్న స్టాఫ్ నర్సులు, 2వ ఎఎన్ఎం, ఇతర క్యాడర్ పారామెడికల్ సిబ్బందిని వివిధ వైద్యభాగంలో ఉద్యోగులు అందించిన సేవలను పరిగణించి వయోపరిమితి నిచ్చి రెగ్యులర్ చేయమని కోరుతున్నామని అన్నారు. సమగ్ర శిక్ష, వెలుగు, ఉపాధి హామీ తదితర అన్ని పై ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వ రంగ సంస్థలు, స్థానిక సంస్థలు, స్థానిక సంస్థల్లోని ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి. ఈ లోగా రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా వేతనాలు కల్పించాలని కోరు తూ జరిగే ధర్నాని విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మలక సుభాషిని, సీత, దేవి, భువనేశ్వరి ఉద్యోగులు పాల్గొన్నారు.

వరద బాధితులకు 'లయన్స్' సాయం

ప్రజాశక్తి-అమలాపురం



ఈశ్వర్ కుమార్‌కు చెక్కు అందజేస్తున్న ఎంఎల్‌ఎ దాట్ల

విజయవాడ వరద బాధితుల సహాయార్థం లయన్స్ క్లబ్ అమలాపురం, లయన్స్ క్లబ్ వశిష్ఠ, లయన్స్ క్లబ్ కోనసీమ సంయుక్త ఆధ్వర్యంలో జిబిటి లీడర్ లయన్ ముదునూరి శ్రీరామరాజు రూ.1,00,000 చెక్కును ముమ్మిడివరం ఎంఎల్‌ఎ దాట్ల సుబ్బరాజు చేతుల మీదుగా జిల్లా గవర్నర్ లయన్ ఇవి.ఈశ్వర్ కుమార్‌కు శనివారం అందజేశారు. కార్యక్రమానికి లయన్ బాదం బాలకృష్ణ లయన్ పి.ఉమామహేశ్వర రావు, లయన్ వినోద్, లయన్ బి.శ్రీనివాసరెడ్డి, లయన్ పులపర్తి శ్రీను, లయన్ యర్రమిల్లి విశ్వేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

రామచంద్రపురం సబ్ రిజిస్ట్రార్‌గా తోట వాసు

ప్రజాశక్తి-రామచంద్రపురం

రామచంద్రపురం సబ్ రిజిస్ట్రార్‌గా తోట శ్రీనివాస్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన సబ్ రిజిస్ట్రార్ జగన్మోహన్ రావు అంబాజీపేట బదిలీపై వెళ్లారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు సబ్ రిజిస్ట్రార్ గా పనిచేసిన తోట శ్రీనివాస్ ఇక్కడకు బదిలీపై వచ్చారు. సబ్ రిజిస్ట్రార్ గా బాధ్యతలు స్వీకరించిన తోట శ్రీనివాస్‌కు ఇక్కడ సిబ్బంది, లేఖర్లు ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు.

రేబిస్‌పై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-రామచంద్రపురం

ప్రపంచ రేబిస్ వ్యాధి దినోత్సవం పురస్కరించుకొని ద్రాక్షారామ జిల్లా పరిషత్ హై స్కూల్లో శనివారం విద్యార్థులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ద్రాక్షారామం పశువైద్యం డాక్టర్ ఎం. కష్ణార్జున ఈ సందర్భంగా మాట్లాడుతూ పెంపుడు జంతువులు కలవడం ద్వారా, అదేవిధంగా వీధి కుక్కలు, కోతులు తదితర జంతువులు కర వడం ద్వారా రేబిస్ వ్యాధి వస్తుందని పెంపుడు జంతువుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. జంతువులకు వయసు వైద్యశాలలో కేకలు వేయించాలని సూచించారు. అదేవిధంగా కుక్కలు కరిసిన వెంటనే ఐదు డోసులు వ్యాక్సిన్లు వేయించుకోవాలని ఈ ఆయన వివరించారు.కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

ఎకో టూరిజం అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి-అమలాపురం

టెంపుల్ టూరిజంతో పాటు ఎకో టూరిజం అభివృద్ధికి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. శనివారం రాష్ట్ర పర్యాటకరంగ అభివృద్ధి అధికారులతో కోనసీమ ప్రాంతంలో ఇప్పటికే స్థాపించిన టూరిజం కేంద్రాల నిర్వహణ స్థితిగతులపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ కోటిపల్లి, పాశర్లపూడి, ఆదూరు, అంతర్వేది, ఎస్ యానం, దిండిలలో ఉన్న పర్యాటక ప్రాం తాలకు పర్యాటకులు ఆకర్షితులయ్యే దిశగా పర్యాట ప్రాంతాలు అభివృద్ధి చేస్తామన్నారు.



భగత్‌సింగ్ చిత్రపటం వద్ద పలువురి నివాళి

ఘనంగా భగత్‌సింగ్ జయంతి

ప్రజాశక్తి-కొత్తపేట

వాడపాలెం గ్రామ సచివాలయంలో శనివారం భగత్ సింగ్ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వాడపాలెం గ్రామ సర్పంచ్ త్సామ ఆదినారాయణ తదితరులు పాల్గొని భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. సర్పంచ్ మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను అర్పించిన స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్ అని అన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది గ్రామ పెద్దలు పాల్గొన్నారు

'బాలబాలాజీ' ఆదాయం రూ.2.18 లక్షలు

ప్రజాశక్తి -మామిడికుదురు

అప్పనపల్లి, శ్రీ బాల బాలాజీ స్వామి దేవస్థానం నందు శనివారం లడ్డు ప్రసాదం విక్రయం, దర్శనము టిక్కెట్లు విక్రయం ద్వారా రూ.1,59,965, నిత్యాన్నదాన ట్రస్ట్‌నకు రూ.59,000 వెరశి మొత్తం రూ.2,18,965 ఆదాయం వచ్చిందని ఆలయ సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి వి.సత్య నారాయణ తెలియజేశారు. స్వామి వారిని 4,956మంది దర్శించుకోగా 2,765మంది అన్నప్రసాదం స్వీకరించారన్నారు.

కార్టూ'నిజం'



డిసెంబర్ నాటికి తాగునీటి ప్రాజెక్టు పూర్తి చేయాలి

రాజోలు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్

ప్రజాశక్తి-రాజోలు

శివారు ప్రాంతాలకు తాగునీటి సమస్య లేకుండా చేసేందుకు సఖినేటిపల్లి మండలం అంతర్వేదిలో నిర్మిస్తున్న రక్షిత తాగునీటి ప్రాజెక్టు ను డిసెంబర్ నెలాఖారు నాటికి పూర్తిచేయాలని రాజోలు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ అధికారులకు ఆదేశించారు. జలజీవన్ మిషన్ పథకం నుంచి నీటి సరఫరా చేసేందుకు రూ.17.33 కోట్ల నిధులతో తాగునీటి పనులు జరుగుతున్నారు. ఈప్రాజెక్టు పనులను ఎంఎల్ఎ వరప్రసాద్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా నీటి సరఫరా చేసేందుకు ప్రాజెక్టు పనులు 60 శాతం పూర్తి అయ్యాయని, ఈ ప్రాజెక్టు చెరువు, ఒవర్ హెడ్ ట్యాంక్ పనులు డిసెంబర్ నెలాఖారుకు పూర్తి చేయాలని, గుత్తేదారులను, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. ఈ పనులు పూర్తయి ప్రాజెక్టు ప్రారంభం అయితే తాగునీటి సరఫరాకు అంతరాయం లేకుండా ఉంటుందన్నారు. శివారు ప్రాంతాల ప్రజలకు పుష్కలంగా తాగునీరు సరఫరా అయ్యే అవకాశం ఉందన్నారు. తాగునీటి సమస్య లేకుండా చూడడమే లక్ష్యంగా పనిచేసి పక్కా ప్రణాళికతో పనులు పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట రాష్ట్ర మార్క్ ఫెడ్ డైరక్టర్ జి.పెదకాపు, ఎంపిపి మల్లిబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ డిఇఇ రాజన్, నాయకులు గెడ్డం మహలక్ష్మీ ప్రసాద్, చాగంటి స్వామి పలువురు పాల్గొన్నారు.



తాగునీటి పనులు పరిశీలిస్తున్న ఎంఎల్ఎ దేవ వరప్రసాద్

1న 'వికాస' ఆధ్వర్యంలో జాబ్ మేళా

ప్రజాశక్తి-అమలాపురం

వికాస వారి ఆధ్వర్యంలో అక్టోబర్ 1న స్థానిక కలెక్టరేట్ నందు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. జాబ్‌మేళాకు సంబంధించి వికాస జిల్లా మేనేజర్ గోళ్ళ రమేష్ కంపెనీల వివరాలను వెల్లడించారు. ఇండో ఎమ్ఐఎం రేణిగుంట తిరుపతి యందు టెక్నీషియన్‌గా ఎస్ఎస్‌సి, ఇంటర్, ఐటిఐ పాసైన 18 నుంచి 30 సంవత్సరాల వయస్సు మరియు గూగుల్ పే నందు ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా 22 నుంచి 45 సంవత్సరాలు, ఎస్ఎస్‌సి నుండి ఏదైనా డిగ్రీ వారికి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పనిచేయటకు వికాస జిల్లా సంస్థ జిల్లా కార్యాలయం నందు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని ఈ సందర్భంగా తెలిపారు.

వ్యర్థాల పునర్వినియోగంతో పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి-అమలాపురం

సమాజంలో ఉత్పత్తి అవుతున్న వ్యర్థాలను సక్రమంగా పునర్వినియోగం చేసినప్పుడే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని మున్సిపల్ కమిషనర్ కెవివిఆర్.రాజు పేర్కొన్నారు. స్వచ్ఛతా హి సేవ -2024 కార్యక్రమంలో భాగంగా శనివారం అమలాపురం పట్టణంలోని విద్యానిధి టాలెంట్ స్కూల్ లో విద్యార్థులు ఏర్పాటు చేసిన వేస్ట్ టు ఆర్ట్ ఎగ్జిబిషన్ ను మున్సిపల్ ఛైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్ర మణి, సత్యనారాయణ, ఎఇ కె.వెంకటేష్ లతో కలిసి పరిశీలించి విజేతలకు బహుమతులు మరియు మెరిట్ సర్టిఫికెట్స్ ను ప్రదానం చేశారు. విద్యానిధి టాలెంట్ స్కూల్ విద్యార్థులు వేస్ట్ పరికరాలు రీసైక్లింగ్ చేసేందుకు ఏర్పాటు చేసిన 'వేస్ట్ టు ఆర్ట్ ఎగ్జిబిషన్' ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విద్యానిధి విద్యా సంస్థల డైరెక్టర్ ఆకుల బాపన్నాయుడు, స్కూల్ ప్రిన్సిపల్ నాగ మాధవి, శానిటేషన్, ఎన్విరాన్మెంట్ సెక్రెటరీస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బహుమతులు అందుకుంటున్న సివి.రామన్‌స్కూల్ విద్యార్థులు

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

గొల్లవిల్లి పంచాయతీ వాడపర్రు ఇందిరానగర్ కి చెందిన గుర్రాల అక్కిరాజు ఇటీవల ప్రమాదవశాత్తు వంట కాలువలో పడి మృతి చెందాడు.ఆ కుటుంబం నిరు పేద కుటుంబం కావడంతో అదే పంచాయతీ వాదపర్రు అంబేద్కర్ నగర్ గ్రామస్తులు రూ.14,210 సమకూర్చారు. ఈ ఆర్థిక సహాయాన్ని శనివారం అక్కిరాజు భార్య, పిల్లలకు గ్రామస్తులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు జొన్నాడ చిన్ని,కాగిత సత్యనారాయణ, బడుగు అబ్బులు, నాగారపు అర్జునరావు, మలపర్తి రాజు, దోనిపాటి వెంకటరమణ, ముడకల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సాయం అందజేస్తున్న గ్రామస్తులు

గుండె వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి-ముమ్మిడివరం



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ మంజీరా

ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పైన, గుండె సంబంధిత వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని మంజీరా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత్రి డాక్టర్ మంజీరా సూచించారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పీపుల్ సర్వీస్ ఆర్గనైజేషన్ లు సంయుక్తంగా ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహనా సదస్సు పీపుల్ సర్వీస్ సంస్థ గౌరవాధ్యక్షుడు టి.నాగరాజా రావు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ మంజీరా మాట్లాడుతూ హదయాన్ని సంరక్షించుకోడం ఎంతో అవసరమని, గుండె ఆరోగ్యంగా ఉండాలంటే ఎల్లప్పుడూ సంతోషంగా నవ్వుతూ ఉండాలని, ప్రతి ఒక్కరు క్రమం తప్పకుండా హృదయ పరీక్షలు చేయించుకోవడం తప్పని సరి అన్నారు. అలాగే మంచి ఆహారపు అలవాట్లు, మంచి జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.ప్రభాకర్ మాట్లాడే ప్రతి ఒక్కరు కూడా వ్యాయామం జాగింగ్ చేయడం ఉత్తమం అన్నారు కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కన్నీడి వెంకటేశ్వరరావు, కళాశాల అధ్యాపకులు డాక్టర్ తులసి లక్ష్మి ,మహమ్మద్ ,సురేష్ రావు, అరవింద్ కళ్యాణ్, భువనేశ్వరి, కె శ్రీనివాసరావు మరియు పీపుల్ సర్వీస్ సంస్థ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంఎల్‌సి కుడిపూడిపై దళిత సంఘాల ఆగ్రహం

ప్రజాశక్తి-అమలాపురం

సోషల్ మీడియాలో శుక్రవారం ఎంఎల్‌సి కుడిపూడి సూర్యనారాయణరావు విడుదల చేసిన వీడియోలో సుప్రీంకోర్టు ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టంపై తీర్పు ఇచ్చిందని తప్పుడు ప్రచారం చేస్తూ చేసిన వ్యాఖ్యలపై దళిత సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. దీనిపై శనివారం ఈదరపల్లి అంబేద్కర్ కమ్యూనిటీ భవనంలో దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. సమావేశంలో దళిత ఐక్యవేదిక కన్వీనర్ జంగా బాబురావు, కార్యదర్శి ఇసుకపట్ల రఘుబాబు, ట్రెజరర్ గెడ్డం సురేష్ బాబు, రేవు తిరుపతిరావు పాలమూరి మోహన్ బాబు మాట్లాడుతూ తన స్వార్థ రాజకీయ లబ్ధి కోసం ఎంఎల్‌సి కుడిపూడి సూర్యనారాయణ రావు ఊసరవెల్లిలా అనేక రాజకీయా పార్టీలు మారుతూ వచ్చాడన్నారు. ఇవ్వని తీర్పును ఇచ్చారని తప్పుడు ప్రచారం చేస్తూ కోనసీమ అల్లర్లలో దోషులను విడుదల చేయాలనడం సిగ్గుచేటన్నారు అనంతరం జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్‌ను కలిసి ఎంఎల్‌సి కుడిపూడి సూర్యనారాయణ రావు చేసిన వ్యాఖ్యలపై, తప్పుడు ప్రచారంపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో ములపర్తి సత్య నారాయణ, సాపే బాలరవి, ఊటాల వెంకటేష్, కాశి వెంకట్రావు, నాగబత్తుల ప్రసాద్‌రావు, కడిమి అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి

ప్రజాశక్తి-రావులపాలెం

ఆసుపత్రి పరిధిలో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అదించాలని రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామక్రిష్ణ వైద్యులను కోరారు. మండలపరిధి గోపాలపురంలో శనివారం జరిగిన స్వచ్ఛతాహీ సేవా ార్యక్రమంలో ఆకుల రామకష్ణ పాల్గొన్నారు. ఈసందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రోగులకు మెరుగైన సహాయం అందించాలన్నారు. ఆసుపత్రికి అవసరమైన వైద్య పరికరాలను సమకూర్చేందుకు తనవంతు సహకారమందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షుడు అధికారి నాగేశ్వరరావు, యాళ్ల మునీశ్వర రావు,ఆనే ముసలయ్య,నల్ల రాజబాబు,కార్యదర్శి అన్వర్, ఎఎన్ఎంలు,ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఆసుపత్రిలో వైద్య సేవలు తెలుసుకుంటున్న ఆకుల



రక్తదానం చేస్తున్న మామిడికుదురు దీప్తి డిగ్రీ కళాశాల విద్యార్థులు

47 మంది 'దీప్తి' విద్యార్థుల రక్తదానం

ప్రజాశక్తి -మామిడికుదురు

మామిడికుదురు దీప్తి డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం, అమలాపురం ప్రభుత్వ ప్రాంతీయ ఆరోగ్య కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన వచ్చింది. శిబిరాన్ని ప్రారంభించిన మామిడికుదురు సర్పంచ్ గౌస్ మొహిద్దీన్ మాట్లాడుతూ ఒకరు రక్తదానం చేయడం ద్వారా మరో ముగ్గురికి ప్రాణం నిలపవచ్చునన్నారు. ఈ సందర్భంగా దానం చేసిన విద్యార్థులను అభినందించారు. దీప్తి విద్యా సంస్థల ఛైర్మన్ డివివి.సత్యనారాయణ, కంప్యూటర్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగాధిపతులు కోడూరి వెంకటేష్, యాలంగి రవికుమార్ తో పాటుగా మరో 47 మంది విద్యార్థిని, విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో అమలాపురం ఆసుపత్రి ల్యాబ్ నిపుణులు సిహెచ్.రాజశేఖర్, డి.కాశీవిశ్వేస్వరరావు, వై.రమణమూర్తి, డి.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ ఎస్ఇగా రాజబాబు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-రామచంద్రపురం



సిద్దెల రాజబాబు

రామచంద్రపురం విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా సిద్దెల రాజబాబు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోనసీమ జిల్లా వ్యాప్తంగా ఎక్కడైనా అపరిష్కతంగా ఉన్న విద్యుత్ లైన్లు, సమస్యలు పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. రిజిస్ట్రేషన్ విద్యుత్ సమస్యల పరిష్కారానికి వినియోగదారులు 1912సంప్రదించవచ్చని, ప్రధానమంత్రి సూర్య ఘర్ రూట్ ఆఫ్ సోలార్ కొరకు సబ్సిడీ వినియోగదారులు రిజిస్ట్రేషన్ నిమిత్తం విద్యుత్ సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అంతకుముందు ఇక్కడ పనిచేసిన విజయానంద్ కోనసీమకు బదిలీ అయ్యారు.ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు, ఎడిఎ కె.మురళీమోహన్, రామచంద్రపురం ఎఇ మేడిశెట్టి వెంకటరమణ, ఆలమూరు ఎఇ ప్రసాద్, విద్యుత్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వెంకన్న ఆలయాల్లో వైసిపి శ్రేణుల పూజలు

ప్రజాశక్తి-యంత్రాంగం

టిటిడి లడ్డూ విషయంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అసత్య ప్రచారాలు మానుకోవాలని వైసిపి రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ సిఎం వైఎస్.జగన్ ఇచ్చిన పిలుపు మేరకు వైసిపి శ్రేణులు వెంకన్న ఆలయాల్లో శనివారం పూజలు చేశారు. **అమలాపురం**: లడ్డూ ప్రసాదంపై కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్ర రాజకీయాలకు నిరసనగా వెంకటేశ్వర స్వామి ఆలయంలో వైసిపి శ్రేణులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. **రామచంద్రపురం:** ద్రాక్షారామ వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద వైసిపి ఇన్చార్జి పిల్లి సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. **త్రేయపురం** వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి తిరుపతి నుండి తీసుకువచ్చిన లడ్డూలను మాజీ ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి తల మీద పెట్టుకుని గుడి మాడవీధుల్లో ప్రదక్షిణ చేసి అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. **మామిడికుదురు:** లడ్డు అంశముపై సిఎం చంద్రబాబు చేసిన వ్యాఖలను నిరసిస్తూ మామిడి కుదురు కనకదుర్గమ్మ ఆలయంలో వైసిపి శ్రేణులతో కలిసి రాజోలు వైసిపి ఇన్చార్జి గొల్లపల్లి సూర్యరావు పూజలు చేశారు. **ముమ్మిడివరం:** నగర పంచాయతీ పరిధిలోని స్థానిక పల్లిపాలెం లో వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం మాజీ ఎంఎల్ఎ పొన్నాడ సతీష్‌కుమార్, నాయకులు పూజలు నిర్వహించారు.

నేరాలు ఘోరాలు



చోరీ సొత్తును పరిశీలిస్తున్న ఎస్పి విక్రాంత్ పాటిల్

దొంగతనాలకు పాల్పడుతున్న ఐదుగురు అరెస్ట్

ప్రజాశక్తి - కాకినాడ

ఇంటి దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు అంతర్ జిల్లా ముద్దాయిలతోపాటు, మోటార్ సైకిల్ దొంగతనాలకు పాల్పడుతున్న మరో ఇద్దరు ముద్దాయిలను అరెస్టు చేసినట్లు ఎస్పి విక్రాంత్ పాటిల్ తెలిపారు. శనివారం ఎస్పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇళ్ల దొంగతనాల చోరీ ముద్దాయిల నుండి రూ.24.99 లక్షల విలువ చేసే చోరీ సొత్తును, రూ.8.90 లక్షల విలువ చేసే 20 మోటార్ సైకిళ్లను రికవరీ చేసినట్లు తెలిపారు. నాలుగు ఇంటి దొంగతనం నేరాలలో కాకినాడ రామకృష్ణారావుపేటకు చెందిన ఇసుకలేటి మోజేష్, రాజమహేంద్రవరంనకు చెందిన ఇసుకలేటి గాంధీలతోపాటు, దొంగబంగారం కొనుగోలు చేసిన తిపర్తి పురుషోత్తమ రామ్‌కుమార్‌ను అరెస్టు చేసి వారి నుంచి రూ.19.39 లక్షల విలువ గల 277 గ్రాముల బంగారంలో 200 గ్రాముల బంగారాన్ని రికవరీ చేశామని, మరో 77 గ్రాముల బంగారాన్ని రికవరీ చేయాల్సి ఉందన్నారు. అలాగే రూ.5.40 లక్షల విలువ చేసే 6 కేజీల వెండిని, 20 వేల మోటార్ సైకిల్ ను రికవరీ చేశామన్నారు. ఇంటి సొత్తు చోరీ కేసుల్లో ముద్దాయిలైన ఇసుకలేటి మోజేష్, ఇసుకలేటి గాంధీ అన్నదమ్ములని, వీరు కాకినాడ, ఏలూరు జిల్లాల్లో రాత్రి సమయాల్లో ఇంటి బయట తాళాలు వేసిన ఇళ్లల్లో చోరీలకు పాల్పడే వారని తెలిపారు. చోరీ చేసిన సొత్తును గాంధీ బావ తిపర్తి పురుషోత్తమ రామ్‌కుమార్ ద్వారా గుర్తు తెలియని వ్యక్తులకు విక్రయించి ఆ సొమ్ములతో జల్సాలు చేసేవారన్నారు. 20 మోటార్ సైకిల్ దొంగతనాలకు కాకినాడ రాగంపేటకు చెందిన కడగాల యేసు, కొయ్య వారి వీధికి చెందిన గొర్రెల దుర్గ ప్రసాద్‌ల నుంచి 20 మోటార్ సైకిల్లను రికవరీ చేశామన్నారు. వీరిని కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు తెలిపారు. ఈ కేసులను చేదించడంలో కృషి చేసిన అడిషనల్ ఎస్పి భాస్కరరావు, డిఎస్‌పి రఘువీర్ విష్ణు, ఎస్‌బి డిఎస్‌పి సిహెచ్.శ్రీరామ కోటేశ్వరరావు, క్రైమ్ సిఐ వి.కృష్ణ, రూరల్ సిఐ చైతన్యకృష్ణ, టు టౌన్ సిఐ అప్పలనాయుడు, క్రైం ఎస్ఐ వినయ్ ప్రతాప్, క్రైమ్ సిబ్బందిని ఆయన అభినందించారు.

రెండు చోట్ల ముగ్గురు అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి-చాగల్లు, పెరవలి

చాగల్లు గ్రామానికి చెందిన మహమ్మద్ ఇమ్రాన్ శుక్రవారం రాత్రి బైకుపై బయటికి వెళ్లి తిరిగి రాలేదు. అతడి బైకు, ఫోన్ నందమూరి వంతెన వద్ద గుర్తించినట్లు ఎస్ఐ కె.నరేంద్ర తెలిపారు. ఇమ్రాన్ సోదరుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పెరవలి మండలంల ముక్కామల గ్రామానికి చెందిన వనసర్ల రాణి, తన ఇద్దరు కుమార్తెలతో కలిసి అదృశ్యమైనట్లు రాణి భర్త వనసర్ల జానకి రాముడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం పిల్లలతో కలిసి పుట్టింటికి వెళుతున్నానని చెప్పి అక్కడికి వెళ్లకుండా అదృశ్యమైనట్టు ఫిర్యాదు చేశారని ఎస్ఐ పి.అప్పారావు తెలిపారు.

ఇసుక కార్యకలాపాలపై పారదర్శకత

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ఇసుక కార్యకలాపాలపై పారదర్శకత, దశ్యమానత ఉండాలని, పర్యవేక్షణ ద్వారా అక్రమ తవ్వకాలు నిరోధించడం, ఇసుక రవాణా, అనుబంధ లావాదేవీల విషయంలో ఖచ్చితత్వం కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఎపి ఇసుక నిర్వహణ వ్యవస్థ, టెక్నికల్ స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ ప్రక్రియపై ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ జిల్లాలో 9 ఇసుక రీచ్‌ల ద్వారా ఇసుకను ప్రజలకు వినియోగదారులకు అందుబాటులోకి తీసుకు వస్తామన్నారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 24న మార్గదర్శకాలను జారీ చేసినట్టు తెలిపారు. సాంకేతికపరమైన అంశాలు, రవాణా వ్యవస్థ తదితర అంశాలపై సూచనలను జారీ చేయడంతో పాటు, ఆన్‌లైన్ ప్రక్రియపై సమగ్ర సమాచారం ఇచ్చామన్నారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే సాంకేతి సిబ్బంది, ఇసుక రీచ్‌లకు ఇన్‌ఛార్జిగా నియమించిన సిబ్బంది అధికారులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆన్‌లైన్‌లో ఇసుక కోసం పేర్లు నమోదు చేసుకున్న సందర్భం నుంచి వినియోగదారునికి సక్రమంగా ఇసుక చేరే వరకూ ప్రతి పాయింట్ వద్ద పర్యవేక్షణ ఉండాలన్నారు. ప్రతి వాహనానికి తప్పనిసరిగా జియో ట్యాగ్ వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడు, ఇన్‌ఛార్జి ఆర్‌డిఒలు కెఎల్.శివ జ్యోతి, ఆర్.కృష్ణ నాయక్, జిల్లా మైన్స్ అధికారి ఫణిభూషణ్ రెడ్డి, మైన్స్ అధికారి విష్ణువ్, ఎస్‌ఐసి అధికారి సతీష్ పాల్గొన్నారు.

ఆమెన్ ట్రస్ట్ ఆధ్వర్యాన దోమ తెరల పంపిణీ

ప్రజాశక్తి - నల్లజర్ల

ఆమెన్ ట్రస్ట్ ఆధ్వర్యాన శనివారం నల్లజర్లలోని లోతట్టు ప్రాంత ప్రజలకు దోమతెరలు పంపిణీ చేశారు. ఉప్పర్ల కాలనీలో దాదాపు 50 కుటుంబాల వారికి దోమ తెరలను డాక్టర్ తెల్లం గంగాధర రావు ద్వారా పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంలో దోమల కాటు వల్ల అనేక రకాలైన వ్యాధులు సోకుతున్నాయని, అలా సోకకుండా ప్రజారోగ్యాన్ని కాపాడే దోమతెరలను పంపిణీ చేసేందుకు ముందుకొచ్చిన ఆమెన్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇవాంజలిన్ అశోక్‌ను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిహెచ్‌ఒ పలివెల ప్రసాదరావు, వైద్య ఉద్యోగుల సంఘం నాయకులు జివివి.ప్రసాద్, ఉద్యోగులు పాల్గొన్నారు.

రసాభాసగా సొసైటీ సర్వసభ్య సమావేశం

-నిధుల దుర్వినియోగంపై నిలదీత
-శాంతింజేసిన ప్రత్యేకాధికారి



అధికారులను నిలదీస్తున్న రైతులు

ప్రజాశక్తి - కరప

కరప ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(సొసైటీ) సమావేశం రసాభాసగా సాగింది. సొసైటీలో జరిగిన అవకతవకలపై వెళ్లిన ఫిర్యాదుల నేపథ్యంలో శనివారం జరిగిన ఈ సమావేశంలో డిసిసిబికి చెందిన ప్రత్యేకాధికారి ఎన్‌విఎస్‌ఎస్‌ఆర్‌కె.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒకరిపై ఒకరు కేకలు వేసుకోవడంతో సమావేశం రసాభసాగా మారింది. రైతులు గోన శ్రీనివాస్, బేరి రామకృష్ణ, గొర్రెల వెంకన్న తదితర రైతులు సమావేశంలో మాట్లాడుతూ రైతులకు దక్కాల్సిన సొమ్ములు రూ.10 లక్షలు అధికారుల నిర్వాకంతో రైతులకు నష్టం వాటిల్లిందని ఆరోపించారు. 2019-20 ఆర్థిక సంవత్సరం నుంచి వరుసగా మూడేళ్ల ఐటి రిటర్న్‌ను సొసైటీ అధికారులు దాఖలు చేయకపోవడంతో సొసైటీ టర్నోవర్‌గా చూపిన రుణాలు రూ.4 కోట్లపై 20 శాతం టాక్స్ రూ.80 లక్షలు కట్టాలని, అప్పటి వరకూ వ్యాపార లావాదేవీలు నిలిపివేయాలని ఐటి అధికారుల నుంచి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు నోటీసులు అందాయని అన్నారు. నోటీసులకు సమాధానం ఇవ్వకపోవడంతో సొసైటీ అకౌంట్లు ఫ్రీజ్ చేసి కార్యాలయానికి కరెంట్ కనెక్షన్లు తొలగించి పది రోజులు మూసి వేయడం జరిగిందని వివరించారు. ఈ సంఘటనలో రైతులు సంఘానికి సంబంధించిన రూ 10 లక్షలు సొమ్ములు చెల్లించారని, రైతుల లావాదేవీలు నిర్వహించేందుకు అనుమతులు తీసుకోవడం జరిగిందన్నారు. అప్పటి అధికారులు తప్పులు చేసి సొమ్ములు చెల్లించటానికి ప్రధాన కారణమైతే రైతులు సంబంధించిన సొమ్ములు చెల్లించడం ఏమిటని నిలదీశారు. ఈ సొమ్ములు రైతులు ఎందుకు నష్టపోవాలని నిలదీశారు. దీనిపై స్పెషల్ అధికారి సమాధానం ఇస్తూ రూ 10 లక్షలు తిరిగి రాబట్టేందుకు కోర్టు ద్వారా ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పిన రైతులు ససేమిరా న్నారు. కోర్టు ప్రయత్నాలు విఫలమైతే ఆ సొమ్ములు రాకపోతే దీనితకి బాధ్యులు ఎవరని నిలదీశారు. ఇకనుంచి ఎటువంటి లావాదేవీలు నిర్వహించిన రైతులకు తెలియపరిచి నిర్వహించాలని, ఇటీవలే భవన నిర్మాణంలో జరిగిన అవకతకులపై కలెక్టర్ ఇచ్చిన ఫిర్యాదు ఏమైందని ప్రశ్నించారు. దానికి ప్రత్యేకమైన విచారణ జరుగుతుందని, ప్రస్తుతం ఇక్కడ జరిగిన పరిస్థితులపై ఉన్నత అధికారులకు నివేదిక అందిస్తామని ప్రత్యేకాధికారి రైతులకు వివరించారు. అప్పటి వరకూ వాడీవేడీగా సాగిన సమావేశం ఆయన ప్రకటనతో రైతులు శాంతించారు. ఈ కార్యక్రమంలో కరప, పేపకాయలపాలెం గ్రామ రైతులు పాల్గొన్నారు.

30న సైన్స్ ఉపాధ్యాయుల శిక్షణ

ప్రజాశక్తి - కాకినాడ



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న అధికారులు

ఈనెల 30న జెఎన్‌టియుకెలోని అల్యూమిని సమావేశ మందిరంలో సైన్సు ఉపాధ్యాయులకు రాష్ట్ర స్థాయి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిఇఒ పిల్లి రమేష్ తెలిపారు. శనివారం విద్యా శాకా కార్యాలయంలో రాష్ట్ర స్థాయి శిక్షణా కార్యక్రమ గోడపత్రికను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎపి రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి, పాఠశాల విద్యాశాఖ, జెఎన్‌టియుకె సంయుక్త ఆధ్వర్యంలో సైన్స్ బోధనలో నూతన పోకడలు, ఆవిష్కరణలు అనే అంశంపై ఈ శిక్షణ ఉంటుందన్నారు. రాష్ట్ర స్థాయిలో సైన్స్ ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. వివిధ జిల్లాల నుం చి జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ సమన్వయకర్తలు, కాకినాడ జిల్లా నుంచి భౌతిక శాస్త్ర, జీవశాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొంటారని అన్నారు. సైన్స్ విద్యలో కృత్రిమ మేధస్సును ఉపయోగించడం, ప్రాజెక్ట్ ఆధారిత అభ్యాసం, పరిశోధన పద్ధతి, సైన్స్‌లో తాజా పోకడలు, సైన్స్ బోధనలో యాప్స్ ఆవశ్యకత అనే అంశాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి ఎం.శ్రీనివాస్‌వినీల్, అకడమిక్ మానిటరింగ్ అధికారి వెంకట రామిరెడ్డి, జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం కార్యదర్శి వి.వెంకట్రావు, జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డిబేట్ పోటీలో కాజులూరు విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - కాజులూరు





డిబేట్ కాంపిటీషన్లో స్థానిక జడ్‌పి పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరచారని హెచ్‌ఎం పంపన కృష్ణమూర్తి తెలిపారు. శనివారం ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు జిల్లా స్థాయిలో శుక్రవారం కాకినాడలో నిర్వహించిన వ్యాసరచన, చిత్ర లేఖనం, డిబేట్ పోటీల్లో పాఠశాల నుంచి మామిడాడ శిరీష, సలాది ధనేశ్వరి జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి పొందారని తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభను చాటుకున్న విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు జె.శామ్యూల్ బెన్‌హర్, సీనియర్ ఉపాధ్యాయులు కెవివి.సత్య నారాయణ, స్టాఫ్ సెక్రటరీ కె.హరినాథ్, చింతా నారాయణమూర్తి, ఎస్ఎంసి ఛైర్మన్ పెంటపాటి పద్దరాజు అభినందించారు.

రైల్వేస్టేషన్‌లో స్వచ్ఛతాహి సేవ

ప్రజాశక్తి - సామర్లకోట



ప్లాట్‌ఫారమ్‌ను శుభ్రం చేస్తున్న సిబ్బంది

స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాల్లో భాగంగా శనివారం స్థానిక రైల్వే స్టేషన్ కార్యాలయాలు, ప్లాట్‌ఫారమ్‌లను శుభ్రపర్చారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ మేనేజర్ రమేష్, చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ కల్యాణి, టికెట్ కలెక్టర్ రమణ, ఆపరేటింగ్, హెల్త్ యూనిట్ సిబ్బంది, లైసెన్సు పోర్టర్స్ పాల్గొన్నారు.

బచ్చు హైస్కూల్ విద్యార్థినికి ప్రథమ స్థానం

ప్రజాశక్తి - సామర్లకోట



జిల్లా విద్యా, వైద్య శాఖల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో తమ స్కూల్ విద్యార్థిని కె.భవ్యశ్రీ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం వచ్చిందని బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ హెచ్‌ఎం తోటకూర సాయి రామకృష్ణ తెలిపారు. కాకినాడలో జరిగిన ఈ పోటీల్లో తమ విద్యార్థి ప్రథమ స్థానంలో నిలిచి రూ.5 వేల నగదు బహుమతిని అందుకుందని చెప్పారు. ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థిని ఎస్ఎంసి ఛైర్మన్ అక్కిన చక్రధర్, వైస్ ఛైర్‌పర్సన్ ఇంజరపు సునీత, ఎంఇఒలు వై.శివరామకృష్ణయ్య, పి పుల్లయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

పూడికతీత పనులు వేగవంతం చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి-అమలాపురం

పంట కాలువలలో పూడిక తీత తొలగించే పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్ లోని డ్రెయిన్, జల వనరుల శాఖ గోదావరి హెడ్ వర్క్స్ ఇంజినీర్లతో సమావేశం నిర్వహించి ఇటీవల మంజూరైన ఆపరేషన్ నిర్వహణ సంబంధించి అత్యవసర శాశ్వత పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జల వనరులు, డ్రైనేజీ విభాగాలకు సంబంధించి ఆపరేషన్ నిర్వహణ టిఆర్ 27 వివిధ గ్రాంట్ల ద్వారా మంజూరైన పనులు త్వరితగతిన పూర్తి చేసి ఆయా వసతులను అందుబాటులోకి తేవాలని ఆయా శాఖల ఇంజనీర్లను ఆదేశించారు.అత్యవసర పనులను మరింత వేగవంతం చేస్తూ పూర్తి చేయాలన్నారు.

జాషువా, భగత్ సింగ్‌లకు ఘన నివాళి

ప్రజాశక్తి-కడియం, రాజమహేంద్రవరం

కవికోకిల గుర్రం జాషువా 129వ జయంతి, షహీద్ భగత్ సింగ్ 117వ జయంతి సందర్భంగా వారికి పలువురు ఘనంగా నివాళులర్పించారు. కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం ఎస్‌కె.రఫీయుద్దీన్, ఎంఇఒ నాగేశ్వరరావు చిత్రపటాలకు మాలాలంకరణచేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయుడు గొల్లపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ తన రచనల ద్వారా సమాజాన్ని చైతన్యవంతంచేసి, విశ్వనరుడుగా ఖ్యాతిగాంచిన వారొకరైతే, బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా విప్లవ మార్గంలో ఉద్యమాన్ని నడిపి ఇంక్విలాబ్ జిందాబాదంటూ ఉరి కొయ్యను ముద్దాడినది మరొకరని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు శరత్ బాబు, గిరిజ, రామకృష్ణంరాజు, శ్రీనివాస్, శ్రీ వెంకట దుర్గా పాఠశాల తెలుగు క్లబ్ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన జాషువా జయంతిలో హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పి విజయ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కె, తెలుగు శాఖ అధిపతి డాక్టర్ బి.సుబ్బలక్ష్మి జాషువా రచనల గురించి వివరించారు. ఈ కార్యక్రమలో డాక్టర్ జి.శ్రీనివాస్, డాక్టర్ ప్రేమ కుమారి, డి.రాజు, కెఎం.సౌందర్యవతి, శ్రీనివాస్ ప్రసాద్, పివి.జగ్జీవన్, శివ కుమార్, డాక్టర్ ప్రిస్కిల్ల తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణంలో ఉన్న ఇళ్లు పూర్తి చేయాలి

ప్రజాశక్తి-రామచంద్రపురం

జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను త్వరితగతిని పూర్తి చేయాలని హౌసింగ్ అధికారి భీమశంకరం తెలిపారు. 23వ వార్డులో కౌన్సిలర్ వాడ్రేవు సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో హౌసింగ్ లబ్ధిదారుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న హౌసింగ్ అధికారి మాట్లాడుతూ వచ్చే సంవత్సరం మార్చి నెలాఖరులోగా నిర్మాణాలను పూర్తి చేయని వారికి పిఎంఎ.వె 1.0 కింద మంజూరైన గృహాలకి ఈ పథకం వర్తించదని అన్నారు. సొంత నిధులతో కట్టుకోవాలి అని తెలిపారు. సచివాలయ ఎమినిటీస్ కార్యదర్శి శిరీష, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రామచంద్రపురం పట్టణ ఎస్‌ఐగా శ్రీనివాస్

ప్రజాశక్తి-రామచంద్రపురం

పట్టణ ఎస్‌ఐగా ఎస్.శ్రీనివాస్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు ఆత్రేయపురం ఎస్‌ఐగా పనిచేసిన శ్రీనివాస్ కొద్దికాలంగా విఆర్‌లో ఉన్నారు. ఇక్కడ పనిచేసిన ఎస్‌ఐ పాటి వాసు విఆర్‌కు వెళ్లడంతో ఇడ ఎస్‌ఐ పోస్టును శ్రీనివాస్‌తో భర్తీ చేశారు. శ్రీనివాసులు సిబ్బంది కలిసి అభినందించారు.

మన ఇల్లు - మన గౌరవంపై అవగాహన

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

మన ఇల్లు - మన గౌరవం పేరుతో గ్రామాల్లో శనివారం ఇంటి నిర్మాణాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. కపిలేశ్వరపురం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన సదస్సులో గృహ నిర్మాణ రుణం మంజూరైన వారు 2025 మార్చి లోగా నిర్మాణాలను పూర్తిచేసుకోవాలని గృహ నిర్మాణ శాఖ డిఇ కె.శ్రీనివాసరెడ్డి తెలిపారు. గృహ నిర్మాణ శాఖ నుంచి సిమెంట్, ఇనుము, సరఫరా చేస్తారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సాకా శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

రోగులకు పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి- రామచంద్రపురం



కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సుభాష్

పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో రోగులకు పౌష్టికాహార పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పాల్గొన్నారు. ప్రవక్త ముహమ్మద్ జన్మించిన మాసాన్ని పురస్కరించుకుని జమాతే ఇస్లామి హింద్ రామచంద్రపురం శాఖ స్థానిక ఏరియా ఆసుపత్రిలో రోగులకు పౌష్టిక ఆహార పంపిణీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మంత్రి సుభాష్ పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పోలిశెట్టి చంద్రశేఖర్, కంచుమర్తి బాబూరావు, జమాత్ కార్యకర్తలు అబ్దుల్ రెహమాన తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సంవర్దన ట్రస్ట్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కడియం

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థినీ విద్యార్థులకు గుంటూరుకు చెందిన సంవర్ధన ట్రస్ట్ రూ.60 వేలు ఆర్థిక సాయం అందించింది. మండపేటలో టిడిపి కార్యాలయంలో ఎంఎల్‌ఎ వేగుళ్ల జోగేశ్వరరావు ఒక్కొక్కరికిఈ రూ.10 వేల చొప్పున చెక్కులను శనివారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక సేవ చేస్తున్న గుంటూరు సంవర్ధన ట్రస్ట్ సేవలను ప్రశంసించారు. సిహెచ్.పూర్ణచంద్రిక, బి.బాలకృష్ణ, డి.హరికృష్ణ, తేజ, జిఎస్ పూర్ణదేవి, పి.శివ దీపికలు చెక్కులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టికెవి.శ్రీనివాసరావు, డాక్టర్ జె.నెహ్రూ నాయక్, మధుకుమార్, వీరాంజనేయులు, సుధారాణి పాల్గొన్నారు.

'స్వచ్ఛతాహి సేవ' పై పర్యవేక్షణ

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

స్వచ్ఛపక్వాడా కార్యక్రమం జిల్లాలోని అన్ని పాఠశాల్లలో అమలుచేశారని స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం అన్ని యాజమాన్య పాఠశాల్లలో అమలు పరచాలని జిల్లా సమగ్రశిక్ష కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి బోరుసు సుబ్రహ్మణ్యం సూచించారు. శనివారం అంగర, కపిలేశ్వరపురం జెడ్‌పి ఉన్నత పాఠశాలలను సందర్శించి పాఠశాలల స్థాయిలో అమలు అవుతున్న కార్యక్రమాలను పర్యవేక్షంచారు .స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులచే నిర్వహించిన మానవ హారంలో పాల్గొన్నారు. విద్యార్థులు స్వచ్ఛతపై ప్రదర్శించిన ప్ల కార్డులు బాగున్నాయని తెలిపారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి ఆయన చేతుల మీదుగా విద్యార్థులకు భోజనం వడ్డించారు. **మామిడికుదురు:** స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాల్లో భాగంగా పాశర్లపూడిలంక, లూటుకుర్రు, ఈదరాడ గ్రామాలలో చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాలను డిఎల్‌పిఒ బుజ్జి రాజు శనివారం పరిశీలించారు. పారి శుధ్య పనులు కూడా పరిశీలించి సూచనలు చేశారు. ఆయన వెంట ఇఒపిఆర్ డి అడబాల శ్రీనివాసరావు, పాశర్లపూడిలంక సర్పంచ్ తెలగా రెడ్డి సూర్యప్రకాశరావు, ఎంపిటిసి సభ్యుడు చెరుకూరి పార్వతి, లూటుకుర్రు సర్పంచ్ అడబాల తాత కాపు, ఈదరాడ సర్పంచ్ చుట్టగుల్ల లక్ష్మి మరియు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా పౌష్టికాహార మాసోత్సవాలు

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలో శనివారం పౌష్టికాహార మాసోత్సవాలు ఘనంగా నిర్వహించారు. గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహార కిట్లను ప్రజాప్రతినిధులు, అధికారులు అందజేశారు.

ఐ.పోలవరం: పశువులంక గ్రామపంచాయితీ పరిధిలో గోడివారిపేట కమ్యూనిటీ భవనంలో శనివారం ముమ్మిడివరం ఐ సి డి ఎస్ ప్రాజెక్ట్ అధికారి ఐ.విమల అధ్యక్షతన పౌష్టికాహార మాసోత్సవాల నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎల్‌ఎ దాట్ల సుబ్బరాజు అంగన్వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పోషకాహార ప్రదర్శనను తిలకించారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఎ చెల్లి వివేకానందం, సర్పంచ్ సఖిలే పెద్దిరాజు, ధూళిపూడి చక్రం, రాంబాబు,గోడి శేఖర్, సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. **ఆలమూరూ :** గర్భిణులు, బాలింతలు సంపూర్ణ ఆరోగ్యం లభించడానికి ఉత్తమ పౌష్టికాహారాన్ని తప్పకుండా తీసుకోవాలని సర్పంచ్ లు సంగిత సుభాష్ , తోట భవానీ, వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని పినపళ్ల, సంధిపూడిల్లో శనివారం పౌష్టికాహార మాసోత్సవాలు ఘనంగా జరిగాయి. కొత్తపేట ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఒ పి.శారద ఆదేశాల మేరకు ఆలమూరు సెక్టార్ సూపర్‌వైజర్ టిఎన్‌వి.నాగలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన పౌష్టికాహార మాసోత్సవాలు వారి అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో ఎఎంసి మాజీ ఛైర్మన్ వక్కపట్ల లక్ష్మణరావు, ఎంపిటిసి సభ్యులు పెదిరెడ్డి పట్టాభి, తోలేటి సంతోషి, కూటమి నేతలు అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. **ముమ్మిడివరం:** నగర పంచాయతీ కార్యాలయం అవరణలో మెప్మా సిఎంఎం ఎస్.భాస్కర్ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాన్ని నిర్వహించారు. ఛైర్మన్ ప్రవీణ్ కుమార్ విచ్చేసి పౌష్టికాహారం కిట్లు అందించారు. ఐసిడిఎస్ అధికారులు పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం:** గర్భిణిలు పౌష్టికాహారం తీసుకోవాలని జెడ్‌పిటిసి సభ్యుడు గెడ్డం సంపదరావు సూచించారు. ఎంపిడిఒ కార్యాలయ సమావేశపు మందిరంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో సీమంతం కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యాధికారి ఎల్. నాగార్జున, సర్పంచ్ ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు తదిరులు పాల్గొన్నారు.

పోటీతత్వంతో ఉత్తమ ఫలితాలు సాధించాలి

ప్రజాశక్తి - సామర్లకోట



స్టడీ మెటీరియల్‌ను అందిస్తున్న ఎంఎల్‌ఎ చినరాజప్ప

నిరుద్యోగ యువతి, యువకులు ఉద్యోగాల సాధనకు పోటీతత్వంతో సాధన చేసి ఫలితాలు సాధించాలని ఎంఎల్‌ఎ నిమ్మకాయల చిన్నరాజప్ప పిలుపునిచ్చారు. శనివారం అచ్చంపేటలోని ఆయన నివాసంలో జనహిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగ పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న సుమారు వంద మంది విద్యార్థులకు ఉచితంగా మెటీరియల్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ తనయుడు రంగనాగ్, నిర్వహకులు దేగల ఈశ్వర్, ఎలుబండి మురళి, యడ్లపల్లి వీరసాయికృష్ణ, రావూరి బుజ్జి, నూనె వెంకటేశ్వర చౌదరి పాల్గొన్నారు.

జనసేన ఆధ్వర్యంలో పూజలు

ప్రజాశక్తి - గండేపల్లి



ఎంపీని సత్కరిస్తున్న నాయకులు

లడ్డు వివాదంపై తాళ్లూరు మఠంలో జనసేన ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తుమ్మలపల్లి రమేష్, కూటమి నాయకులు దాట్ల కృష్ణవర్మ, సూరంపాలెం బాలు, మేడిబోయిన శ్రీను, తోరాటి వెంకన్న, ఇల్లపు రామ్‌ప్రసాద్, గోన శివ పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఆర్ఐ

ప్రజాశక్తి - తాళ్లరేవు

స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆర్ఐగా జిఎస్‌వి.రామకృష్ణ శనివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు.కలెక్టరేట్ నుంచి తాళ్ళరేవుకు బదిలీ కాగా ఇక్కడ ఆర్ఐగా పని చేస్తున్న రవితేజ జిల్లా కలెక్టరేట్‌కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఆయనకు విఆర్ఒలు, కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

ప్రజాశక్తి - సామర్లకోట



విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులకు దృష్టి హాస్పిటల్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి పరిక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో దృష్టి హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ ఎస్.మాధురి మహోన్నత్ పాల్గొని విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ, ఉపాధ్యాయులు డాక్టర్ మాధురిని సత్కరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని మరలావ విద్యుత్ ఫీడర్‌పై ఆర్‌డిఎస్‌ఎస్ పనుల కారణంగా 29వ తేదీ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్తు సరఫరా నిలిపివేయబడుతుందని విద్యుత్ శాఖ ఇఇ ఎపిఎస్‌డిఎస్.ప్రభాకర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. దివిలి సబ్‌స్టేషన్ పరిధిలోని చదలాడ, ఉలిమేశ్వరం, కాండ్రకోట, గుడివాడ, సిరివాడ, మరలావ, తూర్పు పాకలు గ్రామాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని, దీనిని విద్యుత్తు వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

భం చేస్తున్న దశ్యం

పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షునిగా పల్లేశ్వరావు

ప్రజాశక్తి - సామర్లకోట



నూతన కార్యవర్గాన్ని సత్కరిస్తున్న నిర్వాహకులు

రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ సంఘ సామర్ల కోట యూనిట్ నూతన కార్యవర్గ ఏర్పాటు సమావేశం శనివారం సాయంత్రం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో జరిగింది. నూతన అధ్యక్షులుగా ఆర్‌వి.పల్లేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా సిద్దా సూర్యనారాయణ, కార్యదర్శిగా జివి.రాఘవ, కోశాధికారిగా ఎం.డేనియెల్ వరప్రసాద్, సహాయ కార్యదర్శిగా ఎస్.జాన్‌కెనడీబాబు, ఎస్.సత్యంనాయుడు, సభ్యులుగా బి.రాజేశ్వరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో యూనిట్ పరిధిలోని పెన్షనర్లు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్రప్రదేశ్ 2047 గ్రామ సభలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని పలు పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. తాళ్లరేవు, కోరంగి, పి.మల్లవరం గ్రామ పంచాయతీల్లో నిర్వహించిన గ్రామ సభల్లో విజన్ 2047 లక్ష్యాలను ప్రజలకు వివరించారు. ప్రజల నుంచి సమస్యలను స్వీకరించారు.

సర్టిఫికెట్ పడిపోయినది

ది. 28-09-2024న దాసోహం ఉజ్వల, తండ్రి నాగమల్లేశ్వరరావు, ముమ్మిడివరం మండలం, అన్నంపల్లి గ్రామానికి చెందిన నేను 2016లో 10వ తరగతి పూర్తి చేసియున్నాను. ఇటీవల నా ఒరిజినల్ మార్కు లిస్టులను జిరాక్స్ నిమిత్తము ఆటోలో ఇంటి నుండి ముమ్మిడివరం హైస్కూల్ సెంటర్‌కు వచ్చి చూసుకొనగా ఎస్ఎస్‌సి మార్క్ లిస్ట్ ఒరిజినల్ సర్టిఫికెట్ పడిపోయినది. వెంటనే మార్కుల లిస్ట్ కోసం వెతకగా దొరకలేదు. నా మార్క్ లిస్ట్ ఎవరికైనా దొరికిన యెడల నాకు అందజేయగలరని కోరి ప్రార్థిస్తున్నాను.

ఇట్లు: దాసోహం ఉజ్వల
తండ్రి: నాగ మల్లేశ్వరరావు, డోర్ నెంబర్: 1-78, లక్ష్మీదేవి లంక, అన్నంపల్లి, ముమ్మిడివరం మండలం డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, సెల్ నెం.99895 16956

లింక్ దస్తావేజు పోయినది

నా క్లయింటు కారుమూరు వెంకట నాగభద్ర ఉమాదేవి W/o. భీమశంకర వీర వెంకట సత్యనారాయణమూర్తి D.No. 6-380 2వ వీధి మల్లయ్యపేట రాజమండ్రి రూరల్ తూర్పుగోదావరిజిల్లా లో నివసిస్తున్న నా క్లయింటు యొక్క **ఒరిజినల్ లింక్ దస్తావేజ్ నెం.2867/1995** ది.**14-03-1995** SRO రాజమండ్రి నెంబర్లు గల లింక్ దస్తావేజు ది. **09-09-2024** వ తేదిన నా క్లయింటు నా ఇంటి నుండి రాజమండ్రి దేవిచౌక్‌కి కలర్ జిరాక్స్ నిమిత్తం వెళ్ళు చుండగా దేవిచౌక్ మార్గం మధ్యలో పడిపోయినది. ఎవరికైన దొరికిన యెడల ఈ క్రింది అడ్రెస్‌కి తెలియ పర్చవలసిందిగా కోరుచున్నాను.

దాసరి సంజయ్ గుప్త
అడ్వకేట్, డో.నెం. 9-25-8, గుండువారి వీధి రాజమండ్రి, సెల్: 9391473714

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS ARBITRATOR NALGONDA DISTRICT AT NALGONDA.
FILE No. A.A/CF/MNL/NLG/No. 204 Of 2024
Between:-
M/s. KAPIL CHITS (TELANGANA) PVT. LTD. Choutuppal Branch, Represented by its Legal Officer Sri M.Narsimha Raju, S/o. Pichaiah, R/o. Nalgonda town and District.
...Plaintiff/Disputant/Petitioner,
AND
1. Geddam Srinivas, S/o.Abbulu, Age about 45 years, Occ:Pvt.Employee, R/o. H.No.2-20-158, Chiluka Nagar, Uppal, Hyderabad-500039.
2. Gundiga Balaswamy , S/o. Prakasham , Age about 42 years, Occ:Pvt.Emplyoee, R/o. H.No.2-3-72/12,ST Joseph Colony, Ghatkesar, Ranga Reddy, Hyderabad-501301.
3. Dharnaboina Vivek, S/o.Madan, Age about 30years, Occ:Pvt.Emplyoee, R/o. H.No.562-7/1, Antharam, Bibinagar, Venkiryala , Nalgonda District-508116.
4. Vemula Shyam Goud, S/o.Yadagiri, Age about 32years, Occ: Pvt.Emplyoee, R/o. H.No.4-120/3,Shanth Nagar, Ghatkesar, Ranga Reddy, Hyderabad-501301.
5. Aily Upender, S/o.Yadagiri,Age about 37years, Occ: Pvt.Emplyoee, R/o. H.No.6-7, Kurvi, Upparagudem, Warangal District-506002.
6. Sagiraju Krishna Murthy Raju,S/o. Suryanaryana Raju, about 36years, Occ:Pvt Empolyee R/o. H.No.1-166, Kalavagattu, Kajuluru, Seela, East Godavari Dist.A.P-509324.
...Defendants/Opponents/ Respondents.

Where As the above named disputant has made an application for reference of the dispute with regard to non payment of subscription u/s 32 of Chit Fund Act 1982, and Demand for consolidated payment of future subscriptions with interest U/s 33 of Chit Fund Act, 1982, for the chit series KTC01T05P Ticket No.36 Which was sanctioned bearing prior sanction order No. Vide PSC No.NG071220P216 and date on 07-12-2020 to be examined under the provisions of Section 64 of Chit Funds Act, 1982.
As on the date of filing disputed Claim is Rs.**4,97,554-00.**
You are hereby directed to appear before the Deputy Registrar of Chits/Arbitrator, Nalgonda District Register Office Municipal Complex, Nalgonda town and District, in person duly on Dt. **09-10-2024** At 11-00 A.M., in to show cause why the application should not be complied with that we may cause for to be done.
Please take notice that if no appearance is made on the above mentioned date and time and no counter is filed, the case will be disposed on its merits as exparte.

DEPUTY REGISTRAR OF CHITS ARBITRATOR
NALGONDA DISTRITCT
DISTRICT REGISTAR OFFICE
MUNCIPAL COMPLEX NALGONDA.